కథా నిలయం
శ్రీకాకుళం

# ఒక అసందర్భం

సాయంత్రం కాలేజినుండి, ఇంటికి వెళ్తుంటే 'క్లాక్‌టవర్' దగ్గర, ఎదురుపడి, ఆగమంటూ చేయి ఆడించాడు వెంకటరత్నం. స్కూటర్ ఆపి, రోడ్డుకు కాస్త పక్కగా నిలిపి, "బావున్నారా! చాలా రోజులకు కన్పించారు" అన్నాను మాట కలపడానికి! ఇద్దరం ఉన్నది ఒకే ఊళ్ళోనే అయినా, కలుసుకోవటం, ఇదిగో ఇలా యాదృచ్ఛికంగా అరుదుగా జరుగుతూ ఉంటుంది. జీవన వేగం అంటారే, ఇష్టమున్నా లేకపోయినా, అందులో కొట్టుకుపోక తప్పదులా ఉంది.

"బిజీగా ఉన్నారా?" అనడిగాడు వెంకటరత్నం నా చేతిలో చేయి కలుపుతూ–

"బిజీనూ లేదు, తీరికానూ లేదు. చాలా తమాషాగా మారిపోయింది జీవితం.." అన్నాను నవ్వుతూ.

"లావణ్య పెళ్ళి నిశ్చయమైంది. నిశ్చితార్థం ఎల్లుండి శుక్రవారం! సాయంత్రం ఫోన్ చేసి చెబుదామనుకున్నాను. ఇలా కనపడ్డారు. మీరూ, మీ ఆవిడా రండి" అన్నాడు ఆహ్వానిస్తున్నట్టుగా!

"చాలా సంతోషం! నిన్న మొన్నటి పిల్ల, లావణ్యకు అప్పుడే పెళ్ళి అంటే ఆశ్చర్యంగా ఉంది! తప్పక వస్తాం – రండి! అలా హోటల్‌కెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడు కొందాం" అన్నాను స్కూటరును ముందుకు తోస్తూ – ఇద్దరం హోటల్లో ఎదురెదురుగా కూచున్నాము.

"చెప్పండి. అబ్బాయేం చేస్తున్నాడు? ఏవూరు?" అనడిగాను.

వివరాలన్నీ ఉత్సాహంగా చెప్పాడు వెంకటరత్నం. అబ్బాయి పేరు రామకృష్ణ అట! కర్ణాటక రాష్ట్రం- టుంకూరులో డాక్టర్‌గా పనిచేస్తున్నాడట! కొత్త సంబంధమే! తమ అదృష్టం కొద్దీ దొరికిందట. అమ్మాయిని చూడగానే మాట్లాడకుండా ఒప్పేసుకున్నాడు... కట్నం పదిలక్షలట!

కట్నం రేటు వినగానే ఉలిక్కిపడ్డాను. ఒళ్ళు జలదరించింది కూడా! పది లక్షలే! పది లక్షల కట్నం పెట్టగలవాడిలా నాకెప్పుడూ వెంకటరత్నం కనిపించలేదు. ఒక హైస్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేసి, ఈ మధ్యనే రిటైర్ అయిన ఇతను ఈ స్థాయిలో ఉంటాడని నేనెప్పుడూ అనుకోలేదు.

"ఈ మధ్యనే ఊళ్ళో వున్న పొలం అమ్మేశాను. ఎవడు చేస్తాడు నా తర్వాత ఆ వ్యవసాయం! రిటైర్ అయిన తర్వాత వచ్చిన మొత్తమూ ఉంది"

ఇలా అతను చెబుతూనే ఉన్నాడు... అతను చెబుతూంటే సంవత్సరం క్రితం జరిగిన అతడి కొడుకు పెళ్ళి గుర్తుకు వచ్చింది... కొడుక్కు ఎనిమిది లక్షల కట్నం తీసుకున్న సంగతీ స్ఫురించింది. కొడుకు ఎల్.ఐ.సి.లో పెద్ద ఆఫీసర్ రేంజ్‌లో ఉన్నాడు. అతను కట్నం విషయాలు చెబుతూనే ఉన్నాడు. నాకేదో అంతా వికారంగా ఉంది.

పదిలక్షలు ఏ పోస్టాఫీస్‌లో వేసినా నెలకు పదివేలకు పైగా వడ్డీ వస్తుంది. ఆ డబ్బుల్తో ముగ్గురు మొగుళ్లను సాకవచ్చు అన్న ఆలోచన కలిగి నవ్వొచ్చింది నాకు.

"పది లక్షలూ ఏకంగా వాళ్లకిచ్చెయ్యటమేనా! అమ్మాయి పేరన ఏమైనా వేస్తున్నారా?" అనడిగాను.

ఆ మాటకు ముఖంలో కొద్దిగా రంగులు మారాయి వెంకటరత్నానికి! అలా అయితే బాగానే ఉండేది...అస్సలు ఒప్పుకోలేదు వాళ్ళు, ఎనిమిది లక్షలు ఇస్తాం! అమ్మాయి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్లో రెండు లక్షలున్నాయి. అవి మరో రెండేళ్ళకు మెచ్యూరిటీ అవుతాయి అన్నాము మేము...అమ్మాయి పేరున వుంటే మంచిదే! అవి అమ్మాయికే ఉంటాయి. మాకు మాత్రం పదిలక్షలూ క్యాష్‌గానే ఇచ్చేయాలి అన్నారు వాళ్ళు!" అన్నాడు వెంకటరత్నం దిగులుగా. తన కొడుకు విషయంలో తాను పాటించిన నీతినే ఇప్పుడు వాళ్ళూ పాటిస్తున్నారని ఆక్షణంలో వెంకటరత్నానికి గుర్తుకు వచ్చినట్లు లేదు. కొడుకు పెళ్ళికి, ఒప్పుకున్న కట్నాన్నంతా, ఆయన పెళ్ళికి ముందే, ముక్కు పిండి వసూలు చేసుకున్న సంగతి నాకు తెలుసు. కనీసం 10 శాతం, అమ్మాయి చీరలకైనా పట్టుకుంటాం, అంటే కూడా ఈ పెద్దమనిషి అప్పుడు వినలేదు. ఇక్కడ నుండి హైదరాబాద్‌కు ఎంత దూరమో, హైదరాబాద్ నుంచీ ఇక్కడికి అంతే దూరం గదా!

"అంత డబ్బు పోసి, ఈ సంబంధం చూడకపోతే ఏం..." అన్నాను నేను.

"ఉన్నది ఒక్క అమ్మాయి... మావాడు (కొడుకు) గాలించి, గాలించి తెచ్చాడీ సంబంధాన్ని...తప్పదు మరి! మరీ టీచర్ల సంబంధాలు కూడా ఇప్పుడు మూడు, నాలుగు లక్షలు పలుకుతున్నాయి." అన్నాడు వెంకటరత్నం కాఫీ తాగటం ముగించి.

టీచర్ అంటే గుర్తుకొచ్చింది వెంటనే! లావణ్య బి.ఎస్‌సి, బి.ఇడి పూర్తిచేసి మాథ్స్ అసిస్టెంట్‌గా రెండేళ్ళ క్రితం నుంచి, జడ్.పి. హైస్కూల్లో పనిచేస్తోంది.

వరుడేమో కర్ణాటక. ఆ అమ్మాయి ఉద్యోగమేమో ఇక్కడ. ఎలా పొత్తు కుదురుతుంది? ఈమాటే అడిగాను వెంకటరత్నాన్ని.

"అమ్మాయిని ఉద్యోగం మానేయమన్నారు వాళ్ళు. మాకేం తక్కువ టీచర్ ఉద్యోగం చేయించటానికి అంటున్నారు వాళ్ళు" చాలా సాధారణ విషయంలా అతను చెబుతుంటే నివ్వెరపోయాను నేను.

"ఇందుకు మీరు ఒప్పేసుకున్నారా" ఇదేం ఘోరం అన్న ధోరణిలో అడిగాను నేను.

"ఒప్పుకోక ఏంచేస్తాం! ఇక్కడ అమ్మాయి ఉద్యోగం చేయటం ఎలా కుదురుతుంది మరి" అని అతడు తాపీగా సమాధానం చెబుతూంటే షాక్ తిన్నాను నేను. ఇదెక్కడి దారుణం? పదిలక్షలు కట్నం ఇచ్చి నెలకు ఆరేడువేలు వచ్చే ఉద్యోగం వదులుకుని, వట్టి చేతుల్తో ఈ అమ్మాయి వాళ్ళింటికి వెళ్ళటమా! ఆక్షణంలో వెంకటరత్నాన్ని చూస్తూంటే పరమ అసహ్యం వేసింది నాకు.

"మరి ఫిక్సడ్‌లో వున్న ఆ రెండు లక్షలైనా అమ్మాయి పేరున అలాగే వుంచేస్తున్నారా లేదా" అనడిగాను ఆ మొత్తమైనా ఎంతో కొంత సెక్యూరిటీగా ఉంటుందని.

"ఇక్కడికే తాడు చాలకొచ్చింది మాకు - మొన్ననే తీసేసుకున్నాం ఆ మొత్తాన్ని" అని అతడు చెబుతుంటే, దిగ్భ్రాంతికి గురయ్యాను నేను. బాగా చదువుకున్న అమ్మాయిని, ఉద్యోగం కూడా వదిలించి, మరీ ఇంత నిరాధారంగా వాళ్ళింటికి పంపటమా! చాలా దిగులుతో కూడిన ఆరాటం కలిగింది నాకు. ఇదేమిటి? పెళ్ళిళ్ళు మరీ ఇంత ఘోరంగా తయారవుతున్నాయి? ఇన్నిన్ని లక్షలు పోసి ఎవరిని సుఖ పెడుతున్నట్టు? ఒక భయంకరమైన సామాజిక చట్రంలో ఇంతకన్నా ఇరుక్కుపోవటం వుంటుందా? మరీ ఇంత వేగంగా ఈ కట్నాల రేట్లు పెరగటమేమిటి? ఇది కూడా సరళీకృత ఆర్థిక విధానాల పుణ్యమేనా? వెంకటరత్నంలాంటి వాళ్ళు ఎందరెందరో ఈ పరుగు పందెంలో, దేన్ని సాధించాలని పరుగెత్తుతున్నారో! ఇదంతా తలచుకుంటూంటే భయంతో శరీరం జలదరించింది నాకు. రేపోమాపో నేను చేయాల్సిన మా అమ్మాయిల పెళ్ళిళ్ళ మాటేమిటి? ఇలా నేనూ వేటాడబడాల్సిందేనా? ఎక్కడ దారితప్పి పోయాం మనం? ఎవరు మనల్ని దారి తప్పించారు? సామాజిక, ఆర్థిక వ్యవస్థకు, మనుషుల్ని ఇంత దారుణంగా మార్చివేసే గుణం, ఇలా కొనసాగాల్సిందేనా? మానవ సంబంధాలన్నీ ఈక్రమంలో కలుషితం కావాల్సిందేనా?

నాలుగైదు నిమిషాలు మా ఇద్దరిమధ్యా అసంగతమైన నిశ్శబ్దం అలుముకుంది.. పెళ్ళి కోసం అప్పుడే ఏర్పాటు చేయించిన కళ్యాణమండపం గురించీ, ఆ ఖర్చుల్ని గురించీ చెబుతూనే ఉన్నాడు. చూడగా ఇతను ఏదో గొప్ప సంతోషాన్ని, అధికృతా భావాన్నీ అనుభవిస్తున్నట్టుగానే నాకు అనిపించింది. అతడు ఏవేవో చెబుతూనే ఉన్నాడు. అవేవీ నా తలకెక్కటం లేదు.

"ఇంతకూ ఉద్యోగం మాన్పించటం గురించి లావణ్య ఏమీ అభ్యంతరం చెప్పలేదా? పెళ్ళి విషయంలో లావణ్య అభిప్రాయం కనుక్కున్నారా?" ఎందుకో చిన్న సందేహం వచ్చి అడిగాను.

"ఏం చెబుతుంది చిన్నపిల్ల! ఆ ఉద్యోగంతో ఆ పిల్ల సతమతమయి పోతూందనుకో" అంటూ గొణిగాడు వెంకటరత్నం.

"అంటే లావణ్యను మీరేమీ అడగనేలేదా? లావణ్యకి ఈ పెళ్ళి గురించి ఏమీ చెప్పనేలేదా?"

"ఏమడిగినా మౌనంగానే ఉంటోంది! ఏదో చెప్పిందనుకో! నా ఎదుట కూచొని ఎప్పుడైనా నాలుగు మాటలు మాటాడింది గనుకనా... " అన్నాడు వెంకటరత్నం... ఈ పెద్దమనిషి, స్కూల్లోనే కాదు, ఇంట్లో కూడా హెడ్మాస్టరే అని నాకు తెలియంది కాదు. ఇతడింట్లో వున్నంత సేపూ ఇల్లు 'పిన్‌డ్రాప్ సైలెన్స్'గా వుండిపోవాల్సిందే! ఇతడి వ్యవహారం చూస్తే ఈ పెళ్ళి వ్యవహారం లావణ్యతో చర్చించినట్టే లేదు.

"మీరు పొరపాటు చేస్తున్నారేమో" అన్నాను నేను. "పొరపాటా? ఏం పొరపాటు?" ఆశ్చర్యపోతూ అన్నాడతను.

"లావణ్యతో ఈ పెళ్ళి విషయం మీరు వివరంగా చర్చించి ఉండాల్సింది..."

"చర్చించాలా? ఇందులో చర్చించటానికేముంది? మంచి సంబంధం! బాగా ఆస్తిపాస్తులూ, ఉద్యోగమూ, సంప్రదాయమైన కుటుంబమూ..."

"ఇవన్నీ నేను కాదనటంలేదు. మునుపటిలా, అంతా తల్లిదండ్రులే నిర్ణయించే కాలం కాదుగా ఇది! కొంత ప్రజాస్వామికంగా వ్యవహరించే కాలంలో వున్నాం మనం! పిల్లల అభిప్రాయాలు తెలుసుకోవటం వల్ల నష్టం ఏమీ వుండదు కదా! అదీగాక మన లావణ్య ఏరికోరి టీచర్ ఉద్యోగం చేస్తూంది. ఎంసెట్‌లో ర్యాంక్ తెచ్చుకొనే అర్హత వుండీ కోరి టీచర్ ఉద్యోగం చేయాలనుకున్న ఆడపిల్ల లావణ్య! తన ఉద్యోగం విడిచిపెట్టి, ఈ పెళ్ళికి మనస్ఫూర్తిగా ఇష్టపడుతుందా అని" అన్నాను నేను... నన్నేదో సంకటం పీడిస్తూ ఉంది. అందుకే ఈ చర్చ!!

"ఉద్యోగం విషయం నేనూ అడిగాను..ఉద్యోగం విడిచిపెట్టటం తనకూ ఇష్టం లేదంది.. పెళ్ళయింతర్వాత చూద్దాంలే అన్నాను. అంతగా కావాలంటే, ఏ ఎల్.ఐ.సీ.లోనో, పోస్టల్‌లోనో సంపాదించుకొని అక్కడే ఉద్యోగం చెయ్యవచ్చులే అని నచ్చచెప్పాను..." అన్నాడు నసుగుతూ వెంకటరత్నం.

"ఇప్పుడిలా అనుకుంటున్నారు. రేపు పెళ్ళయింతర్వాత ఆ భర్త ఉద్యోగం చెయ్యొద్దు అంటే అప్పుడెలా..."

"నేనింత దీర్ఘంగా ఆలోచించలేదు. ఇలా ప్రతిదాన్నీ అనుమానిస్తూ కూచుంటే ఏవో వంకలు కనిపిస్తూనే ఉంటాయి. అయినా ఇప్పుడన్నీ నిశ్చయమైపోయాయి గదా." చిరాకును కనపరుస్తూ అన్నాడు వెంకటరత్నం.

"నిశ్చయమైపోయింది మీ దృష్టిలో! పదిలక్షల కట్నం అంటేనే వణుకు వస్తోంది నాకు! అంత భారీ కట్నం మొగుడిని మోసే స్థితిలో లావణ్య వుందేమో ఆలోచించారా?"... నేనిలా ఎందుకు వాగుతున్నానో నాకే అర్థంకావటం లేదు... ఆ పిల్లను తలుచుకుంటుంటే నా మనసు భారమైపోతోంది. ఎంత చక్కని పిల్ల! ఎంత అందమైన పిల్ల! ఎంత చురుకైన పిల్ల! ఎక్కడో ఏదో లింకు తెగిపోయినట్టనిపించింది.

వెంకటరత్నం చాలా విసుగ్గా మొహం పెట్టేశాడు. అతని ఇబ్బంది నాకు అర్థమయింది. శుభం పలకరా నాగన్నా అంటే ఏవో అవాకులూ, చవాకులూ వాగుతావేమిటి అన్న ధోరణితో ఆయన నన్ను ఒక చూపు చూశాడు.

కాఫీ బిల్లు చెల్లించి, హోటల్ నుంచి బయట పడ్డాము - ఎల్లుండి ఉదయమే ఇంటికి రమ్మని మరీ మరీ కోరి వెళ్ళిపోయాడు వెంకటరత్నం. నేను స్కూటరెక్కి నిస్సారంగా ఇంటివేపు మళ్ళాను.

ఇరవై ఏళ్ళ క్రితం, నేనూ, వెంకటరత్నమూ ఒక పల్లెటూరి హైస్కూల్లో, కలిసి ఐదేళ్లు పనిచేశాం! పనిచేసే వూళ్లోనే కాపురాలు వుండే కాలమది! నేను సైన్స్ అసిస్టెంట్‌గా, అతను సోషియల్ స్టడీస్ అసిస్టెంట్‌గా పనిచేసేవాళ్ళం! వెంకటరత్నం మంచి ఉపాధ్యాయుడూ, మంచి స్నేహితుడూ! నేనూ వూరికి బదిలీ అయి వెళ్ళగానే, నాకు అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేసి, ఇల్లు కుదిర్చి, అతిథి సత్కారాలు చేసినవాడతడు! విశాలమైన ఆ పల్లెటూళ్లో, రెండు మూడు ఇరుకు గదులున్న ఇళ్ళల్లో మేము కాపురాలు చేసినప్పటికీ, ఎప్పుడూ ఇరుకును మానసికంగా అనుభవించిన వాళ్ళంకాదు... ఒకరి అవసరాలు ఒకరు తెలుసుకొని, ఎదుటివాళ్ళు అడక్కముందే, సహాయ సహకారాలు, ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో మా స్నేహం కొనసాగింది. మా ఇద్దరిమధ్య భావసంబంధమైన సారూప్యతలాంటిది ఏమీ లేకపోయినా, మేమిద్దరమూ హాయిగానే కలిసిపోయేవాళ్ళం! ఇరుకుటుంబాల మధ్య చాలా ఆదరపూర్వకమైన, ఆత్మీయమైన రాకపోకలు వుండేవి కూడా! అప్పుడు అక్కడ పుట్టిన అమ్మాయి లావణ్య, వెంకటరత్నం దంపతులకు! లావణ్యను చంకనెత్తికొనీ, గుండెల మీద పడుకోబెట్టుకొనీ, వీపు మీద మోసి, ఎంతో జీవితానందాన్ని అనుభవించినవాణ్ణి నేను. మాకప్పటికింకా పిల్లలు లేరు. అందువల్ల మా ఇంట్లోనే పెరిగింది ఆ పిల్ల! ఆ తర్వాత సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి జూనియర్ లెక్చరర్‌గా నేనూ, హెడ్మాస్టర్‌గా ప్రమోషనొచ్చి వెంకటరత్నమూ ఎవరిదారిన వాళ్ళం వెళ్ళిపోయాం.

ఐదేళ్ల క్రితం, మళ్ళీ ఇప్పుడున్న టౌన్‌లో, ఒకచోటికి చేరుకున్నాం మేము! సమీపంలోని హైస్కూల్లో పనిచేస్తూ ఈటౌన్లోనే సొంతంగా ఒక ఇల్లు కట్టుకొని వెంకటరత్నం సెటిలైపోయాడు. నేను ఇదే టౌన్‌లో జూనియర్ కాలేజీలో పనిచేస్తూ అద్దె ఇంట్లో ఉండిపోయాను. మళ్ళీ ఆడపాదడపా, మా కుటుంబాల మధ్య రాకపోకలు

సాగుతున్నాయి. పసిపిల్లగా వున్నపుడు తన్ను పెంచామని తెలియటం వల్లనే కాబోలు లావణ్య మా ఇంటికి ప్రేమగా తరుచూ వచ్చి వెళ్తుండేది. కాలేజీకి వెళ్ళే దారిలో మేముండటం వల్ల ఎక్కువగా మా ఇంటికి వస్తుండేది లావణ్య. రెండేళ్ళ క్రితం ఉద్యోగంలో చేరింది లావణ్య. అందువల్ల ఏ రెండు మూడు నెలలకో ఓసారి వచ్చి మమ్మల్ని పలకరించి వెళ్తూ వుంటుంది...'అంకుల్' అంటూ ఆ అమ్మాయి నన్నూ, 'బేబీ' అంటూ చిన్నప్పటిలాగే నేనూ, ఒకరినొకరు పలకరించుకోవటం వరకే మా బంధం! ఆ అమ్మాయి మానసిక జీవితంతోనూ, భావ ప్రపంచంతోనూ నాకు సరైన సాన్నిహిత్యం పెంపొందకపోవటం వల్ల, ఈ పెళ్ళి విషయంలో ఎలా రియాక్ట్ అయిందో నేను వూహించుకోలేకపోతున్నాను. అయినా ఏదో దిగులు అంతరాంతరాలలో నన్ను తొల్చివేస్తూనే ఉంది.

ఇంట్లోకి అడుగుపెట్టగానే నా భార్యతో విషయాలన్నీ చెప్పుకొచ్చాను నేను. సరళ అంతా విని "ఇదెక్కడి చోద్యం? ఇలానా ఆడపిల్లకు పెళ్ళిచేసేది..." అంటూ విస్మయపడిపోయింది. "అయినా మనమనుకోటమే కాని, ఇప్పుడు పెళ్ళిళ్ళన్నీ ఇలానే అఘోరిస్తున్నాయి... రేపు మన అమ్మాయిలకైనా లక్షలు పోసి పెళ్ళిళ్ళు చేయాల్సిందేగా!" అని నిట్టూర్చింది.. "అయినా బంగారంలాంటి ఉద్యోగం చేసుకుంటున్న అమ్మాయికి, ఇక్కడే ఉద్యోగం చేసుకుంటుండే పిల్లాడిని చూసి వుండాల్సింది. ఉద్యోగం వదులుకొని వెళ్ళటం మాత్రం ఏం బాగాలేదు" అని తర్కించింది ఆమె.

మరుసటిరోజు రాత్రి తొమ్మిదిగంటలప్పుడు వెంకటరత్నం నుంచి ఫోనొచ్చింది, "లావణ్య మీ ఇంటికేమైనా వచ్చిందా?" అంటూ-

"లేదే! ఏమిటి? ఏం జరిగింది?" అన్నాను నేను చిన్న అనుమానం లాంటిది కలిగి.

"మధ్యాహ్నం భోంచేసి వాళ్ళమ్మతో చెప్పి బయటకు వెళ్ళిందట! ఇంతవరకూ రాలేదు. మీ ఇంటికేమైనా సాయంత్రం వచ్చిందేమో కనుక్కుందామని...." చెబుతున్న అతని గొంతు చాలా బలహీనంగా, విచారంగా వుండటం గుర్తించాను నేను.

"ఫ్రెండ్స్‌తో కలిసి ఫస్ట్‌షోకి వెళ్ళిందేమో, కంగారు పడకండి! మారుతీనగర్‌లో లావణ్య ఫ్రెండ్స్ ఇద్దరున్నారు. దగ్గరే! వెళ్ళి కనుక్కుంటాను." అన్నాను నేను.

నన్నేదో అనుమానం వెంటాడుతూనే ఉంది. మరో అరగంట తర్వాత వెంకటరత్నానికి ఫోన్ చేసి చెప్పాను; వాళ్ళ ఫ్రెండ్స్ ఇళ్ళకి లావణ్య వెళ్ళలేదని! అసలు ఆ ఫ్రెండ్స్‌కు రేపు నిశ్చితార్థం వుందన్న సంగతి కూడా తెలియదట!

నన్ను వెంటనే బయల్దేరి రమ్మన్నాడు వెంకటరత్నం.

స్కూటరేసుకుని వెంకటరత్నం ఇంటికి వెళ్ళాను. ఇంట్లో అంతా భయం భయంగా, బెదురు బెదురుగా ఉన్నారు. బట్టలుగానీ, నగలుగానీ, డబ్బుగానీ ఏమీ

తీసుకెళ్ళలేదట!... రేపు పొద్దున్నే నిశ్చితార్థానికి వస్తున్నారు... ఇప్పుడు చూస్తే ఇలా! వెంకటరత్నం చాలా కోపంగానూ, విచారంగానూ, మాట కక్కటానికి కూడా ఇష్టపడనంత రౌద్రంగానూ ఉన్నాడు.

అతని భార్య "నాకు ఈ సంబంధం వచ్చినప్పటి నుండీ అనుమానంగానే ఉందన్నయ్యా! పది లక్షల సంబంధమా, అబ్బో అని వెక్కిరించింది లావణ్య! "నా ఉద్యోగం వదులుకొని, నిధులు మూటగట్టుకొని, ఊడిగం చెయ్యటానికి వెళ్ళాలన్న మాట" అని కూడా నాతో అంది. నేనీయనతో ఆ విషయం అంటే 'చాల్లే వెధవ బుద్ధులూ, వెధవ మాటలూ' అని కోప్పడ్డారు. ఈ పెళ్ళి ఇష్టం లేకనే అది ఎక్కడికో వెళ్ళుంటుందని నా అనుమానం" అని చెప్పుకొస్తోంది.

"ఇష్టం లేకపోతే ఆ మాట ముందే ఏడవవచ్చుగా" కస్సుమన్నాడు వెంకటరత్నం.

"అది అన్నమాటల్ని మీతో చెప్పాను కదా! ఆ.. దానిదంతా విడ్డూరంలే అని కసురుకున్నారు మీరు. ఎదుటపడి చెప్పేట్టుగా పెంచారా దాన్ని మీరు" అంటూ సన్నగా ఏడుపు మొదలుపెట్టింది ఆమె.

వాళ్ళంతా ఇంత విషాదంలో వుంటే నాకెందుకో సంతోషమే కలిగింది. లావణ్యంటే నాకు గౌరవ భావం ఏర్పడింది. చాలా మంచిపని చేసింది. మాటల్తో గొడవ పడకుండా చేతల్తో చేసి చూపించింది ఈ పిల్ల అన్న ఆలోచనతో ఊపిరి పీల్చుకున్నాను నేను.

ఇంతలో లోపల గదిలో నుండి వెంకటరత్నం కొడుకు పరుగున వచ్చి చేతిలో ఒక కాగితాన్ని వాళ్ళ నాన్నకు చూపిస్తూ "లావణ్య పరుపు మీద, దిండు కింద ఈ ఉత్తరం ఉంది" అంటూ అందించాడు. వెంకటరత్నం గబగబా దాన్ని చదివి నాకందించాడు. అందులో ఇలా వుంది.

"పదిలక్షల మొగుడి భారాన్ని మోసే స్థితిలో నేను లేను. అదీ చేస్తున్న ఉద్యోగం వదులుకొని, నిరాధారంగా! మాటలతో మిమ్మల్ని ఒప్పించలేనని అర్థమై పోయింది... నా నిరసన తెలియజెయ్యటానికే ఇలా నేను వెళ్తున్నాను... భయపడకండి! నాలుగు రోజుల్లో తిరిగివస్తాను - మీరు మళ్ళీ జాగ్రత్తగా ఆలోచించాలనే నా ఈ ప్రయత్నం- లావణ్య."

• *చెలిమి - 7 ఆగష్టు, 1999* •